
ఆంధ్రజ్యోతి

***

ANDHRAJYOTHY



నల్లగొండ

5

ఆదివారం 5 మే 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.151	219	249
సూర్యాపేట	రూ.150	220	250
నల్లగొండ	రూ.155	226	256

ఉష్ణోగ్రత గరిష్ఠం 43.6 । కనిష్ఠం 26.0

సండే ఫోకస్

ఆటలతో.. ఆహ్లాదం ఆరోగ్యం



చదువుతో కుస్తీ పట్టిన చిన్నారులు వేసవి సెలవుల్లో ఆటవిడుపునకే అధిక ప్రాధాన్యం ఇస్తుంటారు. చాలా మంది పిల్లలు క్రికెట్‌పైనే మక్కువ చూపుతున్నారు. కొందరు చదరంగం, ఖోఖో, మార్షల్ ఆర్ట్స్, డాన్స్, గల్లీ ఆటలతో క్షణం తీరికలేకుండా గడిపేస్తున్నారు. ప్రస్తుతం పదో తరగతికి వెళ్లనున్న విద్యార్థులు సెలవుల్లో సిలబస్‌పై పట్టు సాధించి మెరుగైన ఫలితాల సాధనకు కృషి చేస్తున్నారు. మరి కొంత మంది చిత్రలేఖనం, స్విమ్మింగ్, స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్‌పై పరిజ్ఞానంపై దృష్టి సారించారు. అయితే వారికి ఇష్టమైన రంగంలో శిక్షణ ఇస్తే మెళకువలు నేర్చుకోవడంతోపాటు సృజనాత్మకత పెరుగుతుంది. పిల్లల్లో సామాజిక దృక్పథం పెంపొందించే పనులను సైతం వారితో చేయించాలని వ్యక్తిత్వ వికాస నిపుణులు తల్లిదండ్రులకు సూచిస్తున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేసవి శిక్షణా శిబిరాలు ప్రారంభమయ్యాయి. చిన్నారులకు భవిష్యత్తులో ఉపయోగపడే కొన్ని క్రీడలు, పట్టుసాధించాల్సిన అంశాలు చాలా ఉన్నాయి. అందులో ముఖ్యమైనవి కొన్ని ఏంటో చూద్దాం..

\- కోదాడ

» వేసవి సెలవుల్లో ప్రాధాన్యమిస్తున్న పిల్లలు » ఇండోర్, అవుట్‌డోర్ ఆటలతో సృజనాత్మకతకు పదును » ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేసవి శిక్షణా శిబిరాలు

తైక్వాండో..



తైక్వాండో(కరాటే)లో శిక్షణ తీసుకోవడం వల్ల చిన్నారుల బంగారు భవిష్యత్‌కు భద్రత ఉంటుంది. నాలుగేళ్ల వయసున్న పిల్లల నుంచి మొదలు ఇంటర్ విద్యార్థులు సైతం తైక్వాండోలో శిక్షణ పొందవచ్చు. కరాటేలో శిక్షణ తీసుకోవడం వల్ల విద్యార్థుల్లో శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత ఏర్పడుతుంది. అంతేగాక రోజంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా వారి పనులను వారు చురుకుగా చక్కబెట్టుకుంటారు. చదువులో ఏకగ్రత, క్రమశిక్షణ అలవడుతుంది, ప్రత్యార్థుల నుంచి ఎదురయ్యే సమస్యలను అధిగమించే నైపుణ్య సాధనలో తైక్వాండో శిక్షణ సహాయపడుతుంది.

ఖోఖో..



సంవత్సరం మొత్తం పుస్తకాలతో కుస్తీ పడిన విద్యార్థులు వేసవిలో క్రీడలతో చక్కని ఆరోగ్యం సొంతం చేసుకోవచ్చు. ముఖ్యంగా ఖోఖోతో శరీరం మొత్తం కదిలి వ్యాయామం అవుతుంది. ఈ ఆటలో పిల్లలు అధికంగా పరుగెత్తడం ఉంటుంది. దీని ద్వారా శరీరంలో రక్త ప్రసరణ పెరిగి, ఆరోగ్యం మెండుగా మారుతుంది. ఈ ఆటలో పాల్గొనే క్రీడాకారుల సంఖ్య కూడా ఎక్కువ కావడం వల్ల జట్టుగా పనిచేసే, కలివిడితనంగా ఉండే గుణం అబ్బుతుంది.

కబడ్డీ..



గ్రామీణ ఆటల్లో కబడ్డీ ఒకటి. ఈ క్రీడకు కాస్త ఆదరణ తగ్గిన సమయంలో ప్రో కబడ్డీతో ఇప్పుడిప్పుడే ఆదరణ పెరగడం ప్రారంభమైంది. జట్టుగా ఆడే క్రీడ ఇది. ఈ ఆటతో శరీర దృఢత్వం పెరగడంతో పాటు వేగంగా ఆడే ఆటకావడంతో రక్తప్రసరణ వృద్ధి చెందుతుంది. ఎముకలు బలపడతాయి.

క్రికెట్..



విద్యార్థులు ప్రస్తుతం అత్యంతగా ఇష్టపడే ఆటల్లో క్రికెట్ ఒకటి. సెలవు వచ్చిందంటే చాలు బ్యాట్, బాల్ పట్టుకొని గల్లీలో క్రికెట్ ఆడే పిల్లలు చాలా మంది కనిపిస్తుంటారు. నలుగురు ఫ్రెండ్స్ గుమికూడారంటే గ్రౌండ్‌కు వెళ్లి క్రికెట్ ఆడుతూనే ఉంటారు. అంతగా క్రికెట్ ఆదరణ పొందింది. కాగా, క్రికెట్‌తో విద్యార్థుల్లో మానసిక ఉల్లాసంతోపాటు, చురుకుదనం పెరుగుతుంది. అంతేగాక క్రికెట్‌తో శారీరక దృఢత్వం, జట్టుగా పనిచేసే గుణం అలవడుతుంది.

పోటీ పరీక్షలకు సన్నద్ధం

పిల్లల భవిష్యత్ పోటీ పరీక్షలతో ముడిపడి ఉంది. పదో తరగతి, ఇంటర్ పూర్తయినవారు పోటీ పరీక్షల్లో రాణించేందుకు కోచింగ్ ఇప్పించడం మంచిది. పోటీ పరీక్షలు ఐటీఐ, పాలిటెక్నిక్, టీఎస్ఆర్‌జేసీ లాంటి పరీక్షలకు సన్నద్ధం చేయించాలి. అంతేగాక గణితంలో పట్టు సాధించేందుకు క్వాంటేటివ్ ఆప్టిట్యూడ్, ఆల్జీబ్రాలో కోచింగ్ ఇప్పించాలని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు.

స్విమ్మింగ్..

నేటి పిల్లలకు స్విమ్మింగ్(ఈత) నేర్చుకోవడం చాలా అవసరం. ఈవేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవడంతోపాటు ఈత నేర్చుకొనేందుకు స్విమ్మింగ్‌లో శిక్షణ తీసుకుంటే మంచిది. స్వి మ్మింగ్ ద్వారా తమను తాము రక్షించుకొనే మానసిక దృఢత్వం అలవడుతుంది.అంతేగాక బావులు, నదులు, సముద్రాలవద్దకు పిక్‌నిక్, టూర్‌లకు వెళ్లినప్పుడు సిమ్మింగ్ వచ్చి ఉంటే నీటి ప్రమాదాల నుంచి బయటపడవచ్చు.

కంప్యూటర్‌పై పట్టు

నేటి పోటీ ప్రపంచంలో అంతా టెక్నాలజీ మయమైంది. దాని ప్రాధాన్యాన్ని గుర్తించి వేసవిలో పిల్లలకు కంప్యూటర్ పరిజ్ఞానంపై అవగాహన కల్పిస్తే మంచిది. అదేవిధంగా చిన్నారుల సైతం కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు ఉత్సుకత చూపుతుంటారు. పాఠశాలలు ప్రారంభమైతే కంప్యూటర్ పరిజ్ఞానం నేర్చుకునేందుకు వీలుకాదు. అందుకే వేసవిని సద్వినియోగం చేసుకోవడం మంచిది. అదే విధంగా కంప్యూటర్ పరిజ్ఞానం పేరుతో పిల్లలు వీడియో గేమ్స్‌కు అలవాటు పడకుండా, భవిష్యత్‌లో ఉపయోగపడే సాఫ్ట్‌వేర్ లాంగ్వేజెస్, ఎంఎస్ ఆఫీస్ నేర్పించడం మంచిది.

చదరంగం..



పిల్లల్లో మేధస్సుకు పనిచెప్పే ఆటల్లో చదరంగం ముఖ్యమైనది. ఈ క్రీడతో పిల్లల్లో సమయస్ఫూర్తి, ఆలోచనాశక్తి, సమస్యకు పరిష్కారం చేసే నైపుణ్యం అలవడుతుంది. ఇంటి వద్దనే పిల్లలు శిక్షకుడి సహాయంతో ఈ ఆటను నేర్చుకోవచ్చు.

క్యారమ్..



ఏకాగ్రతతో లక్ష్యానికి ఎలా గురిపెట్టాలో నేర్పే ఆట క్యారమ్. పిల్లలు వేసవిలో ఇంటి వద్దే ఈ ఆటను నేర్చుకోవచ్చు. ఈ ఆటతో చదువులో ఏకాగ్రతో పెరుగుతుంది.

వాకింగ్, పరుగు..

నేటి పిల్లలు అధికంగా జంక్‌ఫుడ్‌కు అలవాటుపడ్డారు. పాఠశాల సమయంలో కేక్‌టు, పఫ్‌లు, పిజ్జాలు, బర్గర్‌లు, చిప్స్ తదితర జంక్‌ఫుడ్‌ను అధికంగా తీసుకోవడం వల్ల పిల్లల్లో ఊబకాయం పెరుగుతోంది. విద్యార్థులు వేసవిలో వాకింగ్, పరుగు చేయడం వల్ల చక్కని శరీర ఆకృతి ఏర్పడుతుంది. అంతేగాక వాకింగ్, పరుగు ఆరోగ్యానికి మంచిది.

స్పోకెన్ ఇంగ్లీష్

ఉజ్వల భవిష్యత్‌కు కమ్యూనికేషన్ స్కిల్స్ ఎంతో అవసరం. విద్యార్థులు మున్ముందు చదువుకొనే కోర్సుల్లో ఉత్తమమైన ప్రతిభ, పోటీ పరీక్షలో రాణించేందుకు అవసరమైన ఇంగ్లీష్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు వేసవిలో స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణ ఉపయోగకరం.

ఈ ఆటలపై ఓ కన్నేద్దాం

గ్రామీణ ప్రాంతాల్లో ఆడే ఆటలు ఎన్నో నేడు కనుమరుగవుతున్నాయి. గోళీకాయ, జిల్లాగోనే, దాగుడుమూతలు, అష్టాచెమ్మా, పచ్చీసు, తొక్కుడు బిళ్ల, చెమ్మచక్క, పిచ్చిబంతి, కోతి కొమ్మచ్చి, గుజ్జనగూళ్లు, గుడు గుడుగుంజం, దాడి, నేల బండ, పులిజూదం, రాముడుసీత, వామన గుంటలు లాంటి ఆటలు ప్రస్తుత కంప్యూటర్ కాలంలో కనుమరుగవుతున్నాయి. నేటి చిన్నారులు బండెడు పుస్తకాలతో కుస్తీ పట్టడమే తప్పా ఆటలు తెలియని పరిస్థితి నెలకొంది. సమయం దొరికితే తల్లిదండ్రుల సెల్ ఫోన్‌లో ఆటలు ఆడటం తప్ప గ్రామీణ ఆటలు వారికి పరిచయమే ఉండటం లేదు. ఈ ఆటల పేర్లే తెలియడం లేదు. మానసిక ఉల్లాసాన్ని, సామాజిక దృక్పథాన్ని నేర్పే గ్రామీణ క్రీడలను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో గ్రామీణ ఆటలు, వాటి తీరుతెన్నులు ఇలా..

సీసం గోళీ



ఈ ఆటను మూడు విభాగాలుగా విభజిస్తారు. ఒకటి గుంట ఆట, రెండు ఆస్ ఆట, మూడు బొంబాయి ఆట. వీటిని ఎంతమందైనా ఆడవచ్చు. గుంట ఆటలో దూరం నిచ్చి గోళీకాయ విసురుతారు. ఎవరైతే గుంటకు దగ్గర గోళీ వేయగలరో వారు మిగ తా వారు గెలిచినట్టు. ఆస్ ఆట దీర్ఘచతురస్ర ఆకారంలో ఉన్న ఒక చట్రంలో గోళీలను ఉంచుతారు. సుమారు మూడు మీటర్ల దూరం నుంచి తమ దగ్గర ఉన్న మరో గోళీని చట్రంలో ని గోళీలకు విసురుతారు. ఇలా చట్రంలోపల ఉన్న గోళీలను బయటికి కొడుతూ విజయం సాధిస్తారు. బొంబాయి ఆటలో ఓ వృత్తం గీసి అందులో గోళీలు ఉంచుతారు. దూరం నుంచి ఆగీతకు దగ్గరకు ఎవరు గోళీ వేస్తారో వారు మొదట వృత్తంలోని గోళీలను కొట్టాల్సి ఉంటుంది. వృత్తంలో వచ్చిన గోళీలు వారి సొంతమవుతాయి.

జిల్ల గోనె



జిల్లగోనెలో రెండు జట్లు ఉంటాయి. ప్రతీ జట్టులో 11 మంది సభ్యులు ఉంటారు. రెండు జట్ల కెప్టెన్లలో ఒకరు జిల్లను విసిరివేస్తే రెండో వ్యక్తి దాన్ని కొట్టాలి. అతడు కొట్టిన జిల్లను రెండో జట్టు వాళ్లు అందుకోవాలి. అప్పుడు వారు ఆడాలి. జిల్లను అందుకోలేకపోతే మొదటి జట్టు వాళ్లే ఆటను కొనసాగిస్తారు. ఇలా ఆడుతున్న సమయంలో గూటికి జిల్ల విసిరితే ఎదుటివారు దాన్ని ఎగరేసి కొట్టాల్సి ఉంటుంది. అలా కొట్టిన తరువాత గోనేతో కంటే, రూళ్లు, మూళ్ల, నాళ్ల, ఐదుళ్ల, ఆరుళ్ల, ఏడుళ్ల, ఎనిమిదళ్ల, తొమ్మిదళ్ల, బిల్లా అంటూ లెక్కిస్తారు. అలా పది లెక్కేశాక ఒక పాయింట్ వస్తుంది. జిల్లను రెండుసార్లు గాలిలో ఎగరేసి కొడితే రెట్టింపు పాయింట్లు వస్తాయి. ఎవరు ఎక్కువ పాయింట్లు సాధిస్తే వారు విజయం సాధించినట్టు.

ఏడు పెంకులాట

గ్రామాల్లో చిన్నారులు వీధుల్లో ఎక్కువగా ఆడే ఆట పెంకులాట. రెండు జట్ల మధ్య ఆడే ఈ ఆటలో ఏడుపెంకులు (నాపరాళ్ల ముక్కలు) బంతితో కొడతారు. పెంకులను పడేశాక తిరిగి వాటిని పేర్చాలి. ఈ క్రమంలో అవతలి జట్టువారు బంతితో కొడతారు. బంతి తాకకుండా పెంకులు పేరిస్తే విజయం సాధించినట్టు.

కోతికొమ్మచ్చి

ఈ ఆటలో ముందుగా ఒకరిని దొంగగా ఎంచుకుంటారు. మిగతా వారిలో ఒకరు వృత్తాకారం గడి నుంచి కర్రను విసురుతారు. అలా విసిరిన కర్రను దొంగ తీసుకొచ్చి గిరిలో ఉంచుతాడు. ఆ తర్వాత మిగతా వారిని తాకడానికి ప్రయత్నిస్తాడు. మిగతా వారు అతడికి దొరకుండా గిరి దగ్గరికి వస్తారు. ఇలా ఆటా కొనసాగుతూ ఉంటుంది.

గుజ్జన గూళ్లు

ఉమ్మడి కుటుంబాలు ఉన్నప్పుడు చిన్నపిల్లలు ఇంట్లో పప్పులు, మరమరాలు, బెల్లం, పంచదారతో ఆడుకొనే ఆట ఇది. ఉమ్మడి కుటుంబాలకు నాందిపలికిన ఆట గుజ్జన గూళ్ల ఆట.

గుడు గుడుగుంజం

బాలబాలికలు ఇష్టపడే ఆట ఇది. పిల్లలందరూ ఓ చోట కూర్చుని రెండు చేతులు పిడికిళ్లు బిగించి ఒకరి పిడికిలి మీద, మరొకరు పిడికిలి ఉంచుతారు. ఆటలో పెద్దగా ఉండే ఒకరు పిడికిలిలో తన చూపుడు వేలును ఉంచి ఆడిస్తూ పాటను పాడుతూ ఉత్సాహంగా ఆటను కొనసాగిస్తారు.

తొక్కుడు బిళ్ల



గ్రామీణ ప్రాంతాల్లో ఆడపిల్లలు అధికంగా ఆడే ఆట తొక్కుడుబిళ్ల. నాలుగు నిలువుగళ్లు, రెండు అడ్డ గళ్ల గీచి, బిళ్లను దీర్ఘచతురస్ర గడుల్లో వేసి కాలు మడిచి ఎనిమిది గడుల నుంచి బిళ్లను బయటకు తీసుకొచ్చే ఆట ఇది.

దాగుడు మూతలు

కళ్లు మూసుకొని అంకెలు లెక్కపెట్టేలోగా మిగతా వారు రహస్య ప్రదేశాలలో దాక్కుంటారు. వారిని కనిపెట్టే ఆట దాగుడు మూతల ఆట.

నెలబండ

నెల మీద దొంగ, మిగతా వారు బండ మీద ఉండి ఆడే ఆట నెలబండ. బండమీద ఉంటూ దొంగను ఆటపట్టిస్తు ఈ ఆటను ఆడుతుంటారు. నెల మీదకు వచ్చిన వారిని దొంగ పట్టుకొవాలి. అతడికి దొరికిన వారు దొంగగా ఆడాల్సి ఉంటుంది.



అండర్-14 విజేతలుగా శ్రీషితి, అథర్వ

» ముగిసిన జాతీయస్థాయి టెన్నీస్ సిరీస్ » విజేతలకు బహుమతి ప్రదానం

ఎంతో ఉత్కంఠ.. ఉత్సాహంగా సాగిన జాతీయ స్థాయి టెన్నిస్ అండర్-14 సిరీస్ శనివారం ముగిసింది. ఆరు రోజులు కొనసాగుతున్న ఈ పోటీలకు జిల్లాకేంద్రంలోని న్యూడైమెన్షన్ టెన్నిస్ అకాడమీ వేదికైంది. టెన్నిస్ సిరీస్ సింగిల్స్ బాలుర విజేతగా తెలంగాణకు చెందిన అథర్వ శ్రీరామోజు,బాలికల ఛాంపియన్‌గా కర్ణాటకకు చెందిన శ్రీషితి కిరణ్ నిలిచారు. చివరి రోజున జరిగిన సింగిల్స్ ఫైనల్స్‌లో తెలంగాణకు చెందిన అథర్వ శ్రీరామోజు తెలంగాణకే చెందిన వంజి ఆర్యన్ పాతునూరిపై విజయం సాధించాడు. బాలికల విభాగంలో కర్ణాటకకు చెందిన శ్రీషితి కిరణ్, మహారాష్ట్రకు చెందిన శిభాని గుప్తాపై గెలుపొంది విజేతగా నిలిచింది.

\- భువనగిరి టౌన్

• 7లో



ప్రసాదం కోసం ప్రయాస

యాదగిరీశుడి భక్తులకు స్వామివారి ప్రసాదం కోసం ప్రయాస తప్పడంలేదు. ప్రసాదాలకోసం 25మెట్లు ఎక్కి, దిగాల్సి వస్తుండడంతో సాధారణ భక్తులతో పాటు వృద్ధులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. టికెట్ ఓ దగ్గర తీసుకొని ప్రసాదాలు మరో చోట తీసుకొని రావాల్సి ఉండడంతో అటు, ఇటు పరుగెత్తాల్సిన పరిస్థితి ఏర్పడిందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

\- భువనగిరి అర్బన్

• 7లో

ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించాలి

పరిశీలకుడు మనోజ్‌కుమార్ మాణిక్‌రావు సూర్యవంశీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకుడు మనోజ్‌కుమార్ మాణిక్‌రావు సూర్యవంశీ

నల్లగొండ టౌన్, మే 4: అధికారులు సమన్వయంతో పార్లమెంటు ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సాధారణ పరిశీలకుడు మనోజ్‌కుమార్ మాణిక్‌రావు సూర్యవంశీ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో సూక్ష్మ పరీక్షలకులకు నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. ఎన్నికల నిర్వహణలో సూక్ష్మ పరిశీలకుల విధులు చాలా కీలకమన్నారు. ఓటరు ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రంలో చూపే 12 గుర్తింపు కార్డులపై అవగాహన ఉండాలన్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ఎన్నికల సంఘం పోలింగ్ సమయాన్ని గంట పెంచిందన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే తన నెంబర్ 7337046757కు కాల్ చేయాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ఎన్నికల శిక్షణ నోడల్ ఆఫీసర్, జేడీఏ శ్రవణ్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రామిక్, మాస్టర్ ట్రైనర్ డి.బాలు, తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల రెండో విడత ర్యాండమైజేషన్

ఈవీఎంల రెండో విడత ర్యాండమైజేషన్‌ను కేంద్ర ఎన్నికల సంఘం పరిశీలకుడు మనోజ్‌కుమార్ మాణిక్‌రావు సూర్యవంశీ సమక్షంలో శనివారం కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన నిర్వహించారు. పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్ల రాండమైజేషన్ ప్రక్రియలో అభ్యర్థులు, వారి ఏజెంట్ల సందేహాలను నివృత్తి చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ఏఆర్‌ఓలతోపాటు, పలు రాజకీయ పార్టీల అభ్యర్థుల ప్రతినిధులు పంకజ్ యాదవ్, శ్రీను, లింగయ్య, స్వతంత్ర అభ్యర్థులు చొల్లేటి ప్రభాకరాచారి, పాలకూరి రవి, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా పోస్టులపై ప్రత్యేక నిఘా: ఎస్పీ

నల్లగొండ టౌన్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తున్నామని, అందులో భాగంగా సోషల్ మీడియాలో పెట్టే పోస్టులపై నిరంతరం నిఘా ఏర్పాటుచేశామని ఎస్పీ చందనాదీప్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా సామాజిక మాధ్యమాల్లో రాజకీయ పార్టీలు, వ్యక్తులపై అనుచిత వ్యాఖ్యలు, విద్వేషపూరిత ప్రసంగాలు, మతాలు, కులాలను రెచ్చగొట్టేలా పోస్టులతో శాంతి భద్రతలకు విఘాతం కలిగ్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సోషల్ మీడియా పోస్టులను సోషల్ మీడియా మానిటరింగ్ సెల్ ద్వారా పర్యవేక్షిస్తున్నామన్నారు.

దేశంలో కాంగ్రెస్‌ను గెలిపించాలి

» నీటి పారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



మఠంపల్లి ప్రచార సభలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మఠంపల్లి, మే 4: పార్లమెంట్ ఎన్నికలో బీజేపీకి ఓటేసి గెలిపిస్తే రిజర్వేషన్లు తొలగిస్తారని, రాజ్యాంగం ప్రమాదంలో పడే పరిస్థితి ఏర్పడుతుందని నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మఠంపల్లిలో శనివారం ప్రచార సభలో ఆయన మాట్లాడారు. జనాభా ప్రతిపదికన రిజర్వేషన్ల అమలుకు దేశంలో కాంగ్రెస్‌ను గెలిపించాలన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒక్క ఎంపీ సీటు కూడా రాదన్నారు. ఎన్నికలయ్యాక బీఆర్ఎస్ ఉనికి లేకుండా పోతుందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌లకు డిపాజిట్ కూడా దక్కదని, దేశమంతా కాంగ్రెస్ గాలి వీస్తోందని, నల్లగొండ ఎంపీ అభ్యర్థి కందూరు రఘువీర్‌రెడ్డిని 5లక్షల ఓట్ల మెజార్టీతో గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. మఠంపల్లి మండలంలో లిఫ్టులు, రహదారులు వేల కోట్లతో అభివృద్ధి పనులు తన హయాంలోనే చేపట్టినట్లు తెలిపారు. గత ప్రభుత్వం గిరిజనులు, ఆదివాసుల మధ్య చిచ్చుపెట్టి భూసమస్య పరిష్కరించేలేక పోయిందని, ఎన్నికల అనంతరం పోడు భూముల సమస్య పరిష్కరించి పేద రైతులందరికీ న్యాయం చేస్తామన్నారు. మాజీ మంత్రి జానారెడ్డి మాట్లాడుతూ మఠంపల్లి మండలం కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని, రాష్ట్రంలోనే తన తనయుడు రఘువీర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, జిల్లా మహిళా అధ్యక్షురాలు అనురాధ, భూక్య మంజూనాయక్, వంటిపులి శ్రీనివాస్, ఆదూరి కిషోర్‌రెడ్డి, వి.సుబ్బారావు, డీవీఆర్, తన్నీరు మల్లిఖార్జున్‌రావు, సింగారపు అరుణసైదులు, అప్పారావు, సక్కునాయక్, భీముడునాయక్, బి.బాబు, ఎంపీపీ పార్వతి కొండానాయక్, పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్లు రామచంద్రయ్య, బాబునాయక్, సీపీఎం, సీపీఐ నాయకులు పల్లె వెంకటరెడ్డి, పాండునాయక్, బాలునాయక్ పాల్గొన్నారు. అంతకుముందు మండలంలోని ఎంపీటీసీ చింతరెడ్డి నాగిరెడ్డి, కిందితండా సర్పంచ్ భరత్‌నాయక్, వెంకన్న కాంగ్రెస్‌లో చేరారు.

'పట్టభద్రుల' స్థానానికి మూడో రోజు

నాలుగు నామినేషన్లు

నల్లగొండ టౌన్, మే 4: వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఉపఎన్నిక స్థానానికి నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. మూడో రోజు శనివారం నల్లగొండ కలెక్టరేట్‌లో నలుగురు అభ్యర్థులు ఆరు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. నేషనల్ నవక్రాంతి పార్టీ అభ్యర్థిగా కర్నె రవి ఒక సెట్, స్వతంత్ర అభ్యర్థులుగా బక్క జడ్సన్ రెండు సెట్లు, భైరవ భట్ల శ్రీనివాసరావు, బైద సోమ సుందరం ఒక్కో సెట్ నామినేషన్ దాఖలుచేశారు. ఇందులో కర్నె రవి నవక్రాంతి పార్టీ తరఫున, స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ పత్రాలను నల్లగొండ జిల్లా కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ములుగు అదనపు కలెక్టర్, ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి సిహెచ్.మహేందర్‌జీకి అందజేశారు.

నామినేషన్ కౌంటర్ 3వ రోజు

పట్టభద్ర నియోజకవర్గం	4న దాఖలు	గతంలో దాఖలు	మొత్తం
నల్లగొండ	4	8	12



నల్లగొండలో నామినేషన్ దాఖలు చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి బక్క జడ్సన్

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

జేడీఏ శ్రవణ్‌కుమార్

మాడ్గులపల్లి, మే 4: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జేడీఏ శ్రవణ్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను ఆయన తనిఖీచేసి మాట్లాడారు. దుకాణాదారులు యూరియా కొరత సృష్టించవద్దని అలా చేస్తే లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. రైతులు యూరియా తీసుకున్న వెంటనే దుకాణాదారుల నుంచి రశీదు తీసుకోవాలని, వాటిని ఇవ్వని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు పత్తి విత్తనాలను లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దే కొనుగోలు చేయాలని సూచించారు. ఆయన వెంట ఏవో సైదానాయక్, ఉన్నారు.

ఎండలు దంచుతూనే ఉన్నాయ్

● ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 46.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

నల్లగొండ/భువనగిరి అర్బన్, సూర్యాపేట టౌన్, మే 4: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎండలు దంచుతూనే ఉన్నాయి. అగడి గాలులు తగ్గకపోవడంతో ఇంట్లో నుంచి బయటకు వెళ్లాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. అధిక ఉష్ణోగ్రతలతో నీటి చెలిమ కోసం పక్షులు, మూగజీవాలు అల్లాడుతున్నాయి. యువకులు, చిన్నారులు ఎండల నుంచి ఉపశమనంకోసం స్విమ్మింగ్‌పూల్, బావుల్లో ఈతకొట్టేందుకు వెళుతున్నారు. రైల్వేస్టేషన్లు, ఆర్టీసీ బస్టాండ్లు, ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లాలో వడదెబ్బతో ఒకరు మృతి చెందారు. శనివారం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 46.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నల్లగొండ జిల్లాలో అత్యధికంగా నల్లగొండ జిల్లా తెల్దేవర్‌పల్లిలో 46.7 డిగ్రీలు, అత్యల్పంగా చింతపల్లి మండలం గొడకండ్లలో 40.2 డిగ్రీలు నమోదయ్యాయి. సూర్యాపేట జిల్లా మునగాలలో అత్యధికంగా 46.0 డిగ్రీలు, అత్యల్పంగా తుంగతుర్తిలో 41.6 డిగ్రీలు, యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మల రామారం మండలంలో అత్యధికంగా 45.0 డిగ్రీలు, మోత్కూరు మండలం దత్తప్పగూడెంలో అత్యల్పంగా 40.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

వడదెబ్బతో ముగ్గురి మృతి

భువనగిరి రూరల్/నూతనకల్ / పెన్‌పహాడ్/ మునగాల : యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని జమ్మాపురంలో గ్రామపంచాయతీ ఉద్యోగి వడదెబ్బతో మృతి చెందారు. గ్రామానికి చెందిన మాదాసు కసప రాజు (65) గ్రామంలో నీటి సరఫరా చేస్తుండగా వడదెబ్బతో అస్వస్థతకు గురయ్యారు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమాధ్యంలో మృతిచెందారు. కసపరాజు గ్రామంలో వాటర్‌మన్‌గా గత 25 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం దిర్శనపల్లిలో ఉపాధి కూలీ మృతి చెందాడు. గ్రామానికి చెందిన గంట వెంకన్న(48) రోజు వారి మాదిరిగానే శనివారం ఉపాధి పనికి వెళ్లి వచ్చాడు. సాయంత్రం వ్యవసాయ భూమి వద్దకు వెళ్లి వచ్చి అలసటగా ఉందని కుటుంబసభ్యులకు చెప్పి మంచి నీళ్లు తాగి స్పృహ తప్పి పడిపోయాడు. కుటుంబసభ్యులు అతడిని చికిత్స నిమిత్తం నూతన్‌కల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. వెంకన్నకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. అదేవిధంగా పెన్‌పహాడ్ మండలం అనంతారం గ్రామానికి చెందిన ఉపాధి కూలీ మామిడి బుచ్చయ్య(58) ఈ నెల 2వ తేదీన ఉపాధి పనులకు వెళ్లి వచ్చి అస్వస్థతకు గురయ్యాడు. ఆయన్ను కుటుంబ సభ్యులు సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఆయనకు భార్య నాగమ్మ, కుమారుడు పాండు, కుమార్తె శ్రావణి ఉన్నారు. బుచ్చయ్య మృతదేహం వద్ద మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీ‌ష్‌రెడ్డి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు జానకిరాంరెడ్డి, సీతారాములు, యుగేందర్, నాగార్జున, వెంకటయ్య, మల్లారెడ్డి, మామిడి పరంధాములు పాల్గొన్నారు. మునగాల మండలం వెంకట్రామపురం గ్రామంలో గరిడేపల్లి మండలం చిన గారకుంటతండాకు చెందిన భూక్య బాజీ(45) వడదెబ్బతో మృతి చెందింది. కొన్నిరోజులుగా మతిస్థిమితం తప్పి తిరుగుతుందని గ్రామస్థులు తెలిపారు.


కసప రాజు(ఫైల్)

గుట్టపై వైభవంగా ఏకాదశి పూజలు

భువనగిరి అర్బన్, మే 4: యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో శనివారం ఏకాదశి పూజలు, నిత్యపూజలు వైభవంగా చేపట్టారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు లక్ష పుష్పార్చన పూజలు పాంచరాత్రాగమన రీతిలో ఆచార్యులు విశేషంగా జరిపారు. సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపిన పూజారులు గర్భాలయంలో కొలువుదీరిన స్వామిఅమ్మవార్లను మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలు, తులసీదళాలతో అర్చించారు. ప్రధానాలయ ముఖమండపంలో స్వామిఅమ్మవారలకు వివిధ పుష్పమాలికలతో లక్షపుష్పార్చన చేపట్టారు. అనంతరం ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో కొనసాగాయి. అనుబంధ శివాలయంలో కొలువుదీరిన శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి నిత్యార్చనలు, రుద్రహవన పూజలు శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. సాయంత్రం వేళ ప్రధానాలయంలో ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా కొనసాగింది. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 38,67,352ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.

స్వామిని దర్శించుకున్న విద్యాశాఖ కమిషనర్ దేవసేన

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామిని విద్యాశాఖ కమిషనర్ దేవసేన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం వేద ఆశీర్వచన మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా, ఈవో భాస్కర్‌రావు లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు.

సంగీత సభలు

దార్మిక, సాహిత్య, సంగీత సభల్లో భాగంగా స్వరనిధి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో భక్తి సంగీతం, ఏలూరి యామిని కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు.

భక్తులకు సౌకర్యాలు

యాదగిరిగుట్టకు వచ్చే భక్తుల కోసం కొండపైన మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. ఏర్పాట్ల విషయాలపై ఈవో ఏ.భాస్కర్ రావు తెలిపిన వివరాల ప్రకారం భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా శివాలయం ముందు భాగంలో ప్రత్యేకంగా కొత్తగా ప్రసాద టికెట్ల కౌంటర్లను ఏర్పాటు, భక్తుల రద్దీ దృష్ట్యా శుక్ర, శని, ఆదివారాల్లో కొండపైన బస్టాండ్ వద్ద, శివాలయం ఎదురుగా అదనంగా ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటు, సమాచార కేంద్రం, చలివేంద్రం ఏర్పాటు, ప్రత్యేక దివ్యవాణి, క్యూ కాంప్లెక్స్‌లో వాల్‌మోటింగ్ ఫ్యాన్లు, శుక్ర, శని, ఆదివారాల్లో ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు సాయంత్రం సంగీత కార్యక్రమాలు, అదేవిధంగా ఏప్రిల్‌లో ఆర్టీసీ బస్సుల ద్వారా 9,825 ట్రిప్పులతో 8 లక్షల మంది కొండ పైకి, కిందకు ఉచిత రవాణకల్పన, ఇందులో 70శాతం మంది మహిళలు, 30శాతం పురుషులు ఉన్నట్లు తెలిపారు. కాగా, ఏప్రిల్‌లో వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు బ్రేక్ దర్శనం రూ.69,10,200, వీఐపీ రూ.96,50,650, ఆర్జిత సేవలు రూ. 1,34,56,805, వ్రతాలు రూ.43,37,300, ప్రసాదాలు రూ.3,05,08,630, హుండీ రూ. 2,33,53,382, విచారణ రూ.24,37,718, ఇతరములు రూ.5,58,51,264 రాగా మొత్తం రూ.15,64,05,949 ఆదాయం సమకూరినట్లు ఈవో తెలిపారు.


స్వామిఅమ్మవార్లకు లక్షపుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకులు

రూ.58 వేల నగదు పట్టివేత

తిప్పర్తి, మే 4 : ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.58 వేల నగదును నల్లగొండ జిల్లా తిప్పర్తి పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ డీ రాజు తెలిపిన వివరాల క్రారం తిప్పర్తి మండలం బమ్మర్రిగూడెం గ్రామానికి చెందిన కొత్త పరమేష్ మిర్యాలగూడ నుంచి 58వేల నగదుతో నల్లగొండ వైపునకు వెళ్తుండగా తనిఖీ చేస్తున్న పోలీసులు గుర్తించారు. నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపించకపోవడంతో నగదును ట్రెజరీకిఅప్పగించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కవిత్వం ప్రజలను చైతన్యపరుస్తుంది

నల్లగొండ కల్చరల్, మే 4: కవిత్వం ప్రజలను చైతన్యపరుస్తుందని ప్రముఖ కవి, తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కార గ్రహీత ఎన్‌వీ.రఘువీర్ ప్రతాప్ అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్‌జీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటుచేసిన 'కవితో కరచాలనం' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మారుతున్న సమాజానికి అనుగుణంగా కవులు కవిత్వాన్ని, రచనలు చేయాలని సూచించారు. సాహిత్యం విలువలతో కూడుకున్నదని, సంస్కృతితో ముడిపడి ఉందన్నారు. కార్యక్రమానికి అధ్యక్షతన వహించిన తెలుగుశాఖ అధ్యక్షుడు డా.కృష్ణ కౌండిన్య మాట్లాడుతూ విద్యార్థుల్లో సాహిత్య సృజన స్ఫురించడం కోసం ఇలాంటి కార్యక్రమాలు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో తెలుగుశాఖ అధ్యాపకురాలు డా.ఎన్.దీపిక, వెల్దండి శ్రీధర్, టీ.సైదులు, ఎస్.ప్రభాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.


కవితో కరచాలనం కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రతాప్

సొరంగం రాతి కంకర లూటీ

నార్కట్‌పల్లి, మే 4: చెర్వుల మట్టి ఓ వైపు ఇటుక బట్టీలకు తరులుతుంటే మరో వైపు ఉదయ సముద్రం కాల్వ సొరంగం రాతి కంకరను కూడా అక్రమార్కులు రవాణా చేసి సొమ్ము చేసుకుంటున్నారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెంలో కొన్నిరోజులుగా ఈ తతంగం కొనసాగుతున్నా అధికారులెవరూ పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. బీ.వెల్లెంలలోని ఉదయసముద్రం ప్రాజెక్టులో భాగంగా కట్టంగూరు మండలం పిట్టంపల్లి నుంచి బీ.వెల్లెంల పంప్‌హౌజ్ వరకు టన్నెల్(సొరంగం)ను తవ్వారు. టన్నెల్ తవ్వకం ద్వారా వచ్చిన రాతి కంకర, చిప్స్ తదితర వ్యర్థాలను ఎల్లారెడ్డిగూడెం, దాసరిగూడెం పరిసరాల్లో రైతుల స్థలాలను లీజుకు తీసుకుని ప్రాజెక్టు అధికారులు నిల్వ చేయించారు. ఐతే ఈ రాతి కంకరను కొందరు రోడ్డు కాంట్రాక్టర్లు, రియల్ ఎస్టేట్ వెంచర్లు చేస్తున్న వ్యాపారులకు ట్రాక్టర్ల ద్వారా తరలించి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. వాస్తవానికి సంబంధిత ప్రాజెక్టు ఐబీ అధికారుల ద్వారా అనుమతి తీసుకుని నిర్ణీత ధర(రాయల్టీ) చెల్లించి తీసుకుపోవాల్సి ఉంది. కానీ ఐబీ అధికారులు పట్టించుకోకపోడంతో సొరంగం రాతి కంకర నిల్వలు లూటీ అవుతున్నాయి. ఎల్లారెడ్డిగూడెం గ్రామస్థులు కొందరు కంకర తరలింపును అడ్డుకునే ప్రయత్నం చేసినా లెక్కచేయడం లేదు.


తరలించేందుకు సిద్ధంగా ట్రాక్టర్లలో పోసిన ఎల్లారెడ్డిగూడెంలో నిల్వ చేసిన రాతి కంకర

నిఘా పెట్టాం: నవీన్, ఐబీ ఏఈ

సొరంగం తవ్వకం ద్వారా బయటకుప్పలు పోసిన రాతికంకరను తరలిస్తున్నారన్న సమాచారం గ్రామస్థుల ద్వారా వచ్చింది. కంకర కుప్పల వద్ద సిబ్బందితో నిఘా ఏర్పాటుచేశాం. అక్రమంగా రాతి కంకరను తరలించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. కేసులు నమోదు చేయిస్తాం.

ప్రసాదం కోసం ప్రయాస

▸▸ టికెట్ కౌంటర్ ఒక చోట..పంపిణీ మరోచోట ▸▸ 50 మెట్లు ఎక్కిదిగాల్సిందే



కొండపైన శివాలయం ఎదురుగా కొత్తగా ఏర్పాటు చేసిన ప్రసాదాల టికెట్ కౌంటర్

భువనగిరి అర్బన్, మే 4 : ఇటీవల యాదగిరిగుట్ట ఆలయ పరిధిలో భక్తుల సౌకర్యార్థం టికెట్లు, ప్రసాదాలు పొందేందుకు కొండపైన శివాలయం ఎదురుగా కొత్త కౌంటర్‌ను ఏర్పాటుచేశారు. దీంతో పాటు ధర్మదర్శనం క్యూకాంప్లెక్స్ వద్ద మరో కౌంటర్ త్వరలో అందుబాటులోకి రానుంది. టికెట్లు, ప్రసాదాలు భక్తులకు వేర్వేరుగా అందించేందుకు అధికారులు ఏర్పాటుచేశారు. కానీ, ప్రస్తుతం శివాలయం ఎదురుగా కౌంటర్ ఏర్పాటుచేశారు. ఇక్కడకు చేరుకొని టికెట్లు తీసుకున్న తర్వాత తిరిగి ప్రసాదాలు పొందేందుకు సుమారు 25 మెట్లెక్కి (అంటే 50 మెట్లు) దిగాల్సి వస్తోంది. అందువల్ల ఈ కౌంటర్ పూర్తిగా అసౌకర్యంగా ఉందని భక్తులు వాపోతున్నారు. టికెట్లు, ప్ర సాదాలు వేర్వేరు చోట ఇవ్వడంతో రద్దీ తగ్గించేందుకు ఎంతో ఉపయోగపడుతుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. కాగా, కొన్ని రోజులు కష్టనష్టాలను బేరీజు వేసుకొని భక్తులకు కావాల్సిన పద్ధతిలో కౌంటర్లను ఏర్పాటుచేస్తామని డీఈవో దోర్బల భాస్కరశర్మ తెలిపారు. కానీ, శివాలయం ఎదురుగా ఉన్న ప్రసాదాల కౌంటర్‌కు వెళ్లి టికెట్లు తీసుకొని ప్రసాదాలు పొందేందుకు తిరిగి పైకి వెళ్లాల్సి రావడంతో మెట్లెక్కాలంటే కష్టతరంగా ఉంది. కాగా, భక్తుల రద్దీ దృష్ట్యా ప్రసాదాల కౌంటర్లను పెంచాలనే యోచన మంచిదే అయినప్పటికీ టికెట్లు, ప్రసాదాలు దూరదూరంగా వేర్వేరు చోట్ల లభించడం అసౌకర్యంగా ఉందని భక్తులు అభిప్రాయపడుతున్నారు. అన్ని మెట్లు దిగి పైకి ఎక్కాలంటే వృద్ధులు, మహిళలు, పిల్లలు, రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ ఇబ్బందుల దృష్ట్యా కౌంటర్లను భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా ఏర్పాటు చేయాలని పలువురు భక్తులు కోరుతున్నారు.

50 మెట్లెక్కి దిగాల్సి వస్తోంది



టికెట్ల కోసం రానుపోను సుమారు 50 మెట్లెక్కి దిగలేకపోతున్నాం. మోకాళ్ల నొప్పితో తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. కౌంటర్లు పెంచాలనే యోచన స్వాగతించాల్సిందే. కానీ, భక్తులకు అందుబాటులో ఉండాలి. మోకాళ్ల నొప్పులు, మధుమేహం, బీపీ ఉన్న వారు ఉంటారని అధికారులు గమనించాలి. అన్ని మెట్లెక్కిదిగలేరు కాబట్టి వారికి సౌకర్యంగా ఉండేలా కౌంటర్లు ఏర్పాటుచేయాలి.

\- జే రమేష్ ,వికారాబాద్

పరిశీలించి సౌకర్యంగా ఏర్పాటు చేస్తాం

భక్తుల రద్దీ దృష్ట్యా అదనంగా కౌంటర్లను ఏర్పాటుచేస్తున్నాం. వీటితో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తుతాయో పరిశీలించి వాటిని సవరించేందుకు చర్యలు చేపడుతాం. భక్తుల సౌకర్యాలే ముఖ్యమని ఒక్కొక్కటిగా ఏర్పాట్లు చేస్తున్నాం. భక్తుల కోరిక మేరకు కౌంటర్‌ను త్వరలో అందుబాటులోకి తెస్తాం. అందుకు భక్తులు సహకరించాలి.

\- డీఈవో దోర్బల భాస్కరశర్మ

కొండపై మార్పులు చేర్పులు

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామిని భక్తులు నిత్యం పెద్దసంఖ్యలో దర్శించుకుంటారు. ఆలయ పునర్నిర్మాణం సందర్భంగా భక్తుల కు ఎలాంటి సౌకర్యాలు లేకుండా కేవలం బాలాలయం లో స్వామి వారి దర్శనానికి మాత్రమే వీలుండేది. కొత్త ప్రభుత్వం, కొత్త ఈవో వచ్చిన తర్వాత భక్తులకు సౌకర్యా లు ఒక్కొక్కటిగా అందుబాటులోకి తెచ్చేందుకు అధికారు లు ఏర్పాట్లు ముమ్మరంచేశారు. ఆలయ ప్రారంభంలో కొండపైన మొబైల్ మరుగుదొడ్లు ఉండగా, ప్రస్తుతం డార్మెంటరీ హాల్ పక్కన శాశ్వత మరుగుదొడ్లను అందుబాటులోకి తెచ్చారు. అదేవిధంగా ధర్మదర్శనం క్యూకాంప్లెక్స్ ఎదురుగా మరో మరుగుదొడ్ల కాంప్లెక్స్ నిర్మాణంలో ఉంది. కాగా, ఇప్పటికే బస్టాండ్ ఆవరణలో భక్తులకు కా వాల్సిన సమాచారం అందించేందుకు హెల్ప్‌డెస్క్‌ను అం దుబాటులో ఉంచారు. డార్మెంటరీ హాల్‌ను ఆలేరు ఎమ్మె ల్యే, విప్ బీర్ల అయిలయ్య ఇటీవల ప్రారంభించగా వాహ న పూజలు నిర్వహించేందుకు స్థల పరిశీలన చేశారు. ఇలా ఒక్కొక్కటిగా పాత విధానం అమలు చేసేందుకు ఆలయ అధికారులు నిర్ణయాలు వేగవంతం చేశారు.

యర్కారంలో టెన్షన్ టెన్షన్

● ఉద్రిక్తతకు దారితీసిన ర్యాలీ
● నేడు సంతాప సభ



యర్కారం గ్రామంలో ఎల్లయ్య అభిమానుల దాడిలో ధ్వంసమైన సామాగ్రి

సూర్యాపేట రూరల్, మే 4: సూర్యాపేట మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడి మృతికి నివాళిగా చేపట్టిన ర్యాలీ ఉద్రిక్తతకు దారితీసింది. ఇరువర్గాల మధ్య చోటుచేసుకున్న వాగ్వాదం 12మంది ఇళ్లపై దాడికి కారణమైంది. దీంతో సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండలంలో యర్కారంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.మాజీ నక్సలైట్, సూర్యాపేట మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వడ్డే ఎల్లయ్య గత నెల 18న భార్యాభర్తల పంచాయితీని పరిష్కరించడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట వెళ్లి హత్యకు గురయ్యాడు. ఎల్లయ్యకు నివాళిగా ఆయన అభిమానులు యర్కారం గ్రామంలో శుక్రవారం సాయంత్రం ఐదు గంటల సమయంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ క్రమ ంలో ర్యాలీకి ఎదురుపడిన ఎల్లయ్య ప్రత్యర్థులు గ్రామానికి ఆయన చేసిందేమీ లేదని వాగ్వాదానికి దిగారు. ర్యాలీని ఆపాలని ఎదురుతిరిగారు. అయితే అప్పటికే గ్రామంలో ఉన్న పోలీసులు ఇరువర్గాలకు నచ్చజెప్పి సద్దుమణిగేలా చేశారు. రాత్రి 9గంటల తర్వాత ఎల్లయ్య వర్గీయులు గ్రామంలోని ఆయన ప్రత్యర్థుల ఇళ్లపై దాడి చేసి ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. సుమారు 12మంది ఇళ్లలోకి చొరబడి ధ్వంసం చేశారు. ఈ ఘటనలపై గ్రామస్థుడు పల్స లక్ష్మణ్ శనివారం ఉదయం ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ బాలునాయక్ తెలిపారు.

దాడి ఘటనలో 27మంది అరెస్టు, రిమాండ్

ఎల్లయ్య అనుచరులు గ్రామంలోని ఇళ్లలోకి చొరబడి ధ్వంసం చేశారన్న ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు ఎస్ఐ బాలునాయక్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో దాడిలో పాల్గొన్న 27మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించామన్నారు. పాతకక్షలతో గ్రామంలో అల్లర్లు సృష్టిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

గ్రామంలో నాలుగేళ్లుగా పికెటింగ్

సూర్యాపేట మండలంలో యర్కారం గ్రామం రాజకీయ వివాదాలకు కేంద్ర బిందువుగా ఉంటుంది. నాలుగేళ్ల కిందట సర్పంచ్ ఒంటెద్దు వెంకన్నను హత్య చేసిన ఘటనలో ఎల్లయ్య ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. హత్య అనంతరం గ్రామంలో ఉద్రిక్తత నేపథ్యంలో పోలీసులు గ్రామంలో పికెటింగ్ నిర్వహిస్తున్నారు. మొదట్లో 10మంది పోలీసులు విడతల వారీగా గ్రామంలో పికెటింగ్ నిర్వహించేవారు. ఎల్లయ్య కిడ్నాప్‌కు గురయ్యే నాటి వరకు నలుగురు కానిస్టేబుళ్లు పికెటింగ్ పాల్గొనేవారు. గ్రామపంచాయతీ భవనం వద్ద ఇద్దరేసి చొప్పున ఉంటూ, గ్రామంలో పర్యటిస్తూ శాంతిభద్రతల పరిరక్షణను చూస్తుండేవారు. ఎల్లయ్య కిడ్నాప్ అయిన రోజు నుంచి గ్రామంలో 50 మంది పోలీసులతో భారీ పికెటింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఎల్లయ్య హత్య, సంతాపంగా ర్యాలీ, అనంతరం జరిగిన ఇళ్లపై జరిగిన దాడితో గ్రామంలో మరోసారి టెన్షన్ వాతావరణం నెలకొంది. ఇప్పుడిప్పుడే గ్రామంలో శాంతి నెలకొంటున్న సమయంలో ఎల్లయ్య హత్యకు గురికావడంతో స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

నేడు ఎల్లయ్య సంతాప సభ

పంచాయితీ సెటిల్‌మెంట్ పేరుతో కిడ్నాప్‌కు గురై 14 రోజుల తర్వాత హత్యకు గురైనట్లు తెలిసిన వడ్డే ఎల్లయ్య సంతాప సభను ఆదివారం గ్రామంలో నిర్వహించేందుకు ఆయన అభిమానులు ఏర్పాట్లుచేశారు. ఈ సభకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీమంత్రులు దామోదర్‌రెడ్డి, జానారెడ్డి, కాంగ్రెస్ నాయకులు హాజరవుతున్నట్లు ఆయన అభిమానులు, కుటుంబసభ్యులు తెలిపారు. అయితే గ్రామంలో తీసే ర్యాలీ సందర్భంగా ఘర్షణలు చోటుచేసుకోకుండా చూడాలని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

● దుస్తులు ఆరేస్తుండగా ప్రమాదం ● కాపాడేందుకు వెళ్లి గాయపడ్డ మరో మహిళ



వెంకమ్మ మృతదేహం

మిర్యాలగూడ అర్బన్, మే 4 : ఉతికిన దుస్తులు ఆరవేస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఓ మహిళ మృతిచెందింది. శనివారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ఈ సంఘటన జరిగింది. సీఐ సుధాకర్, బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మిర్యాలగూడ పట్టణంలోని సుందర్‌నగర్ కాలనీకి చెందిన గుంజ వెంకమ్మ(45) శనివారం ఉదయం దుస్తులు ఉతికి ఆరవేసేందుకు మిద్దె పైకి వెళ్లింది. తడిగా ఉన్న దుస్తులను తీగపై వేస్తుండగా ఇంటికి ఆనుకుని వెళ్తున్న గృహాలకు సరఫరా చేసే విద్యుత్ తీగలకు తగిలి విద్యుదాఘాతానికి గురైంది. కింద పడిన వెంకమ్మను కాపాడే క్రమంలో నెట్టబోయిన మరో మహిళ ఆలకుంట్ల రమాదేవి(24) విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడింది. వీరి కేకలను విన్న స్థానికులు వెళ్లి చూసేసరికి వెంకమ్మ మృతి చెందగా, రమాదేవి కిందపడి ఉంది. రమాదేవి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం నల్లగొండ జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. వెంకమ్మ మృతదేహానికి మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. వెంకమ్మకు దివ్యాంగుడైన భర్త చినదుర్గారావు, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చినదుర్గారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

ఐదు రోజులుగా చికిత్స పొందుతూ మృతి



మణికంఠ(ఫైల్)

హుజూర్‌నగర్, మే 4: ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ఫెయిల్ అయ్యాననే మనస్తాపంతో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. గత నెల 29వ తేదీన ఆత్మహత్యాయత్నం చేయగా, చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం హుజూర్‌నగర్‌కు చెందిన వీరబాబు, సావిత్రిలకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు మేకల మణికంఠ(17) ఉన్నారు. తండ్రి హమాలీగా పనిచేస్తుండగా, తల్లి కూలి పనులు చేస్తున్నారు. మణికంఠ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ (హెచ్ఈసీ) మొదటి సంవత్సరం చదివాడు. గత నెల 24వ తేదీన ఫలితాలు విడుదలకాగా, కొన్ని సబ్జెక్టులు తప్పాడు. కొద్దిరోజులుగా మనస్తాపంగా ఉన్న మణికంఠ 29వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కొద్దిసేపటికి వచ్చిన కుటుంబసభ్యులు మణికంఠను ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడినుంచి మెరుగైన చికిత్స కోసం ఖమ్మంలోని ప్రైవేట్ ఆసుపత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తీసుకెళ్లారు. ఐదు రోజులుగా చికిత్స పొందుతున్న మణికంఠ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మణికంఠ బాబాయి మేకపోతుల సైదులు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ముత్తయ్య తెలిపారు.

బావిలో పడి రైతు మృతి

అనంతగిరి, మే 4 : సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం గోండ్రియాలలో బావిలో పడి వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం గోండ్రియాల గ్రామానికి చెందిన రైతు జల్లా రామకృష్ణ(42) శనివారం ఉదయం పొలానికి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి బయలుదేరాడు. పొలం వద్దకు వెళ్తూ మంచినీరు తాగేందుకు ఓ వ్యవసాయ బావిలోకి దిగాడు. కాలుజారి నీళ్లలో పడిపోయి మృతి చెందాడు. సాయంత్రమైనా రామకృష్ణ రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్ద వెళ్తూ బావి వద్ద రామకృష్ణ చెప్పులు చూసి బావిలో వెతికారు. కొద్దిసేపటికి మృతదేహం లభ్యమైందని ఎస్ఐ తెలిపారు. రామకృష్ణ భార్య ఉమా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా రామకృష్ణకు కుమారుడు ఉన్నారు.

తల్లీకుమార్తె అదృశ్యంపై కేసు



అదృశ్యమైన త్రివేణి, పూజ

హుజూర్‌నగర్, మే 4 : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలంలో తల్లీకుమార్తె అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ముత్తయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బూరుగడ్డకు చెందిన నూకపంగు త్రివేణిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జగ్గయ్యపేట మండలం వల్లభి గ్రామానికి చెందిన నూరేపల్లి ఉపేందర్‌కు ఇచ్చి రెండేళ్ల కిందట వివాహం చేశారు. కాగా వారికి కుమార్తె. సుమారు 10 రోజుల కిందట త్రివేణి తన కుమార్తెకు బాగా లేదని బూరుగడ్డలోని తల్లిగారింటికి వచ్చింది. ఏప్రిల్ నెల 28న పాల ప్యాకెట్ తెస్తానని తల్లి మంగమ్మకు చెప్పి బయటకు వెళ్లింది. త్రివేణి వెంట కుమార్తె పూజని తీసుకుని వెళ్లింది. ఆ తర్వాత ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తల్లి మంగమ్మ శనివారం ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ ముత్తయ్య తెలిపారు. కాగా కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి జైలుశిక్ష

యాదగిరిగుట్ట రూరల్, మే 4 : యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలో శనివారం డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 33 మందికి ఆలేరు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ సుమలత ఒక్కొక్కరికి రూ.2000 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ రవికుమార్ తెలిపారు. మరో 21 మందికి ఒకరోజు జైలుతో పాటు రూ. 2వేల జరిమమానా విధించారన్నారు. ఒకరికి రెండు రోజులు జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధించారని ఆయన వివరించారు.

జాతీయ టెన్నిస్ సిరీస్ విజేతలుగా కిరణ్, శ్రీరామోజు

● ముగిసిన అండర్ -14 జాతీయ స్థాయి టెన్నిస్ సిరీస్
● ఆరు రోజులు కొనసాగిన పోటీలు



సిరీస్ విజేతలతో టీఎస్‌టీఏ అధ్యక్షుడు రమణ్, జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి

భువనగిరి టౌన్, మే 4 : ఆరు రోజులుగా యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రమైన భువనగిరిలో జరుగుతున్న అండర్ -14 టెన్నిస్ సిరీస్ శనివారంతో ముగిసింది. చివరి రోజున జరిగిన సింగిల్స్ ఫైనల్స్‌లో బాలుర విభాగంలో తెలంగాణకు చెందిన అధర్వ శ్రీరామోజు, బాలికల ఛాంపియన్‌గా కర్ణాటక రాష్ట్రానికి చెందిన శ్రీషితి కిరణ్ నిలిచారు. అథర్వ శ్రీరామోజు తెలంగాణకే చెందిన వంజి ఆర్యన్ పోతునూరిపై 3-6, 6-0, 6-4 సెట్లతో విజయం సాధించాడు. మొదటి సెట్‌లో ఓడినప్పటికీ చివరి రెండు సెట్లలో వరుసగా గెలుపొంది నేషనల్ సిరీస్ విజేతగా నిలిచాడు. బాలికల విభాగంలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన శ్రీషితి కిరణ్, మహారాష్ట్రకు చెందిన శివాని గుప్తాపై 6-0, 7-5 సెట్లతో గెలుపొంది విజేతగా నిలిచింది. సిరీస్ విజేతలకు, ప్రతిభ చూపిన క్రీడాకారులకు త్వరలో ఆల్ ఇండియా టెన్నిస్ అసోసియేషన్ పాయింట్స్ కేటాయిస్తూ నేషనల్ ర్యాంకులను ప్రకటించనుంది. ప్రతి రెండు వారాలకు ర్యాంకులు అప్‌గ్రేడ్ అవుతుంటాయి. సిరీస్ విజేతలకు తెలంగాణ స్టేట్ టెన్నిస్ అసోసియేషన్(టీఎస్‌టీఏ) అధ్యక్షుడు కేఆర్ రమణ్, యాదాద్రి భువనగిరి జిల్లా టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు సద్ది వెంకట్‌రెడ్డి మెమొంటోలు, సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో న్యూ డైమెన్షన్ టెన్నిస్ అకాడమీ చైర్మన్ పులిమామిడి సుభాష్‌రెడ్డి, జిల్లా టెన్నిస్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి సయ్యద్ ఖలీం అహ్మద్, ఉపాధ్యక్షుడు దిడ్డి బాలాజీ, సహాయ కార్యదర్శి పరమేష్‌కుమార్ సింగ్, కోశాధికారి అతఉల్లాఖాన్, సహాయ కార్యదర్శి పరమేశ్వర్‌కుమార్ సింగ్, సభ్యుడు ఆవుల వినోద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ ఛాంపియన్‌షిప్ లక్ష్యం



అండర్-12 ఆసియా ఛాంపియన్‌షిప్ సాధించిన వారం రోజుల్లోనే భువనగిరిలో జరిగిన నేషనల్ అండర్-14 బాలికల విజేతగా నిలువడం ఆనందంగా ఉంది. మరో అంతర్జాతీయ సిరీస్‌లో పాల్గొనేందుకు ఇక్కడి నుంచి నేరుగా శ్రీలంకకు వెళ్తున్నాను. ప్రపంచ ఛాంపియన్‌షిప్ సాధించి దేశ ఖ్యాతిని చాటడమే నా లక్ష్యం. కల నెరవేరే వరకు కోర్టుల్లో శ్రమిస్తా.

● శ్రీషితి కిరణ్, బాలికల విజేత

దేశ ఖ్యాతిని చాటుతా



టెన్నిస్‌లో దేశ ఖ్యాతిని చాట డమే నా లక్ష్యం. ఇప్పటివరకు పలు అంతర్జాతీయ టోర్నీల్లో దేశానికి ప్రాతినిధ్యం వహి ంచా. టెన్నిస్‌లో రాణించేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నా. ప్రతిభ చూపితే ప్రోత్సాహం మెండుగా లభిస్తుంది. హైదరాబాద్ టెన్నిస్ కోచింగ్‌కు అనువుగా ఉంది. పలు జాతీయ అంతర్జాతీయ టోర్నీల్లో పాల్గొంటూ ఆట తీరును మెరుగుపర్చుకుంటున్నా.

● అథర్వ శ్రీరామోజు, బాలుర విజేత.

క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నాం



రాష్ట్రంలో ప్రతిభ చూపుతున్న టెన్నిస్ క్రీడాకారులను టీఎస్‌టీఏ ప్రోత్సహిస్తోంది. హైదరాబాద్‌లో టీఎస్‌టీఏ కోచింగ్‌తో పాటు మరో మూడు ప్రైవేట్ టెన్నిస్ అకాడమీలలో మెరుగైన కోచింగ్ అందుబాటులో ఉంది.సానియామీర్జా అనంతరం మరికొద్ది మంది క్రీడాకారులు జాతీయ టెన్నిస్‌లో రాణిస్తుండడం శుభపరిణామం. ప్రతిభ చూపుతున్న క్రీడాకారులకు ఆర్థికంగా మద్దతుకోసం స్పాన్సర్స్ ఎంపికకు సహకరిస్తున్నాం.

● కేఆర్ రమణ్, అధ్యక్షుడు, టీఎస్‌టీఏ.

తొలిసారిగా నేషనల్ సిరీస్ నిర్వహించి విజయవంతం చేశాం



యాదాద్రి భువనగిరి జిల్లా టెన్నిస్ అసోసియేషన్ ఏర్పాటయ్యాక తొలిసారి నేషనల్ సిరీస్ నిర్వహించడం సంతోషంగా ఉంది. ఇందుకు న్యూడైమెన్షన్ టెన్నిస్ అకాడమీ చైర్మన్ పులిమామిడి సుభాష్‌రెడ్డి అందించిన సహకారంతో సిరీస్‌ను విజయవంతం చేశాం. జిల్లాలో టెన్నిస్‌ను ప్రోత్సహించేందుకు మరిన్ని క్రీడలు నిర్వహించేందుకు ప్రయత్నిస్తాం.

● సద్ది వెంకట్‌రెడ్డి, అధ్యక్షుడు, యాదాద్రి జిల్లా టెన్నిస్ అసోసియేషన్.

బ్యాంక్ ఆర్థిక బలోపేతంతోనే జాతీయ స్థాయి గుర్తింపు

● డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ మహేందర్‌రెడ్డి

నల్లగొండ, మే 4 : నల్లగొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు తమ పాలకవర్గంలో ఆర్థికంగా బలోపేతం కావడంతో పాటు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడమే కాకుండా తనకు జాతీయ స్థాయి ఉత్తమ డీసీసీబీ చైర్మన్‌గా అవార్డు లభించిందని డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. జాతీయ ఉత్తమ అవార్డు అందుకున్న నేపథ్యంలో శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలో కేంద్ర డీసీసీబీ కార్యాలయంలో ఆయన్ను ఉద్యోగులు, అధికారులతో పాటు పాలకవర్గ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఉద్యోగి, అధికారులు పీఏసీఎస్ పాలకవర్గాల కృషితో పాటు పాలకవర్గ సభ్యుల సహకారంతో దేశంలోని 540డీసీసీబీలల్లో ఐదు డీసీసీబీలు మాత్రమే ఎంపికయ్యాయని అందులో తెలంగాణ నుంచి నల్లగొండ డీసీసీబీ నుంచి తనకు అవార్డు దక్కడం సహకార రంగ వ్యవస్థతో పాటు ప్రతి ఒక్కరికీ గర్వకారణమన్నారు. గత పాలకవర్గ సమయంలో దేవరకొండ బ్యాంక్ అక్రమాల వల్ల బ్యాంకు ప్రతిష్ట మసక బారిన సమయంలో ఎన్‌పీఏ 11శాతం ఉండేదని, తాము బాధ్యత చేపట్టాక 1.83శాతానికి ఎన్‌పీఏ చేరుకోవడం ఎంతో సంతోషకరమన్నారు. బ్యాంకు 103ఏళ్ల చరిత్రలో కేవలం రూ.900కోట్ల టర్నోవర్ ఉండగా తాము బాధ్యత చేపట్టిన నాలుగేళ్లలో రూ.2,400 కోట్ల టర్నోవర్‌కు చేరుకుందన్నారు. డిపాజిట్లు రూ.400కోట్లు ఉండగా ప్రస్తుతం రూ.674కోట్లకు చేరిందని, అదనంగా రూ.274కోట్లకు అంటే 68శాతానికి పెంచామన్నారు. 2023-24 సంవత్సరం నాటికి అదనంగా రూ.82.42 కోట్ల లాభాలకు చేరుకుందన్నారు. దీనికి ప్రధాన కారణం విద్యా రుణాలు, దీర్ఘకాలిక రుణాలు, గోల్డ్‌లోన్‌లు పెంచామన్నారు. తమ పాలకవర్గం గడువు మరో ఎనిమిది నెలలు ఉందని ఈ వ్యవధిలో తాము రాష్ట్రంలోనే నల్లగొండ డీసీసీబీని అన్నిరంగాల్లో ముందు ఉంచుతామన్నారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్లు పాశం సంపత్‌రెడ్డి, రంగాచారి, కరుణ, జే.శ్రీనివాస్‌తో పాటు సీఈవో శంకర్‌రావు, జీఎం వసంతరావు, యూనియన్ నాయకులు రాజు, సుగుణ్, రవీందర్, శ్రీధర్‌రెడ్డి, శ్రవణ్ రెడ్డి, సతీష్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మఠంపల్లిలో చోరీ : రూ.8.60 లక్షల సొత్తు అపహరణ

మఠంపల్లి, మే 4 : కిరాణా దుకాణంలో దొంగలు పడి 12 తులాల బంగారం, కొంతనగదు చోరీకి గురైంది. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల కేంద్రంలో జరిగింది. శనివారం బాధితుడు వెచ్చా చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం నాలుగు రోజుల కిందట భార్య, పిల్లలతో కలిసి ప్రకాశం జిల్లాలోని తన బంధువుల ఇంటికి చంద్రశేఖర్ వెళ్లాడు. తిరిగి శనివారం ఉదయం ఇంటికి రాగా ఇంట్లో ఉన్న బీరువాలోని వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి.అదేవిధంగా బీరువాలోని 12తులాల బంగారం, వెండి గిన్నెతో పాటు రూ.10వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించినట్లు బాధితుడు తెలిపారు. సంఘటనా స్థలాన్ని క్లూస్ టీం పరిశీలించింది. కాగా ఈఘటనపై కేసు నమోదు, ఇతర వివరాలను పోలీసులు తెలపడం లేదు. సుమారు రూ.8.60 లక్షల విలువైన సొత్తు చోరీకి గురైనట్లు బాధితుడు తెలిపారు.

పనిచేయని సీసీ కెమెరాలు

ఇటీవల ప్రధాన రహదారిపై ఉన్న దుకాణాల్లో చోరీలు వ్యాపారులను కలవరపెడుతున్నాయి. కొంతకాలం కిందట సీసీ కెమెరాల ఏర్పాటుకు కోసం వ్యాపారుల నుంచి పోలీసులు నగదును సేకరించారు. అయితే సీసీ కెమెరాలు పనిచేయడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాత్రి వేళల్లో పోలీసులు పెట్రోలింగ్ చేయకపోవడం, విరాళాలు సేకరించి ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మండల వనరుల కేంద్రంలో చోరీ

కేతేపల్లి, మే 4 : నల్లగొండ జిల్లా కేతేపల్లి మండల కేంద్రంలోని మండల వనరుల కేంద్రం(ఎంఈవో కార్యాలయం)లో చోరీ జరిగింది. ఈ ఘటనలో కంప్యూటర్ సామాగ్రి అపహరణకు గురైంది. వేసవి సెలవుల నేపథ్యంలో ఏప్రిల్ 26వ తేదీ నుంచి కార్యాలయానికి తాళం వేసి ఉంది. దీంతో చోరీ ఎప్పుడు జరిగిందనేది తెలియడం లేదు. ఎంఈవో ఎం.నాగయ్య తెలిపిన మేరకు శనివారం ఉదయం ఆడుకోవడానికి వెళ్లిన స్థానిక పిల్లలు ఎంఈవో కార్యాలయం తలుపు తాళం తీసి ఉండటాన్ని చూసి అధికారులకు సమాచారం ఇవ్వడంతో వెళ్లి పరిశీలించారు. మూడు కంప్యూటర్లు, ఆరు ఇన్వర్టర్ బ్యాటరీలు అపహరించుకుపోయినట్లు గుర్తించారు. కాగా ఈఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఎంఈవో నాగయ్య తెలిపారు.

జీహెచ్‌ఎం సైదులు సేవలు చిరస్మరణీయం



జీహెచ్‌ఎం సైదులు దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొన్న శిష్య బృందం

అచ్చంపేట, మే 4: నల్లమల ప్రాంతంలో ఎంతోమందికి హిందీలో శిక్షణ ఇచ్చి ఉపాధ్యాయులుగా తీర్చిదిద్దిన జీహెచ్‌ఎం సైదులు సేవలు చిరస్మరణీయమని ఆయన శిష్యులు సాజిద్, రూప్లానాయక్, బసవయ్య, శ్రీనివాసులు, నాగేశ్వరరావు కొనియాడారు. శనివారం నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట బస్టాండ్ సమీపంలోని అన్నపూర్ణ ఫంక్షన్‌హాల్‌లో జీహెచ్‌ఎం సైదులు దశదినకర్మ నిర్వహించారు. ఉపాధ్యాయులు, మేధావులు, విద్యార్థులు పాల్గొని ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అచ్చంపేట ప్రాంతంలోని వివిధ పాఠశాలల్లో పనిచేసి విద్యార్థులకు మంచి శిక్షణ ఇవ్వడంతో పాటు హిందీ అంటే మక్కువ ఉన్న విద్యార్థులను ఆయా కోర్సులలో ప్రోత్సహించి మంచి ఫలితాలు రావడానికి కృషి చేశారని ఈ సందర్భంగా సైదులు శిష్యులు ఆయన సేవలను కొనియాడారు.

ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదు

తిప్పర్తి, మే 4 : రోడ్డు ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై నల్లగొండ జిల్లా తిప్పర్తి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామానికి చెందిన భూమ్ పూర్ణచంద్రారెడ్డి ఏప్రిల్ 27వ తేదీన హైదరాబాద్‌లోని తన బంధువుల ఇంటి కోసం వాహనంలో మంచాలను తీసుకెళ్లి అక్కడ పెట్టి అదే రోజు రాత్రి తిరుగు ప్రయాణమయ్యాడు. తిప్పర్తి మండలంలోని కేశరాజుపల్లి రైల్వేగేట్ సమీపంలోకి రాగానే డ్రైవర్ విజయ్‌కుమార్ అతివేగంగా వాహనాన్ని నడుపుతూ 11 గంటల సమయంలో వాహనాన్ని పల్టీ కొట్టించాడు. ప్రమాదంలో పూర్ణచంద్రారెడ్డికి తలకు, ఛాతిపై, డ్రైవర్ విజయ్‌కుమార్‌కు గాయాలయ్యాయి. నల్లగొండలోని ప్రైవేటు ఆసుపత్రిలో ఇద్దరు చికిత్స పొందుతున్నారు. పూర్ణచంద్రారెడ్డి భార్య సరస్వతి శనివారం డ్రైవర్ విజయ్‌కుమార్ అజాగ్రత్తగా డ్రైవింగ్ చేయడం వల్లే తన భర్తకు గాయాలయ్యాయని ఫిర్యాదు చేసిందని, ఆ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

భువనగిరి టౌన్, మే 4 : యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలోని సంజీవనగర్ సమీపంలో శనివారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సుమారు 60 ఏళ్ల గల వృద్ధుడి మృతదేహం పడి ఉండడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో ఎస్ఐ అరుణ్ ఆధ్వర్యంలో మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచారు. మృతదేహం ఆచూకీ తెలిసిన వారు పట్టణ పోలీసులను సంప్రదించాలని సూచించారు. మృతుడు యాచకుడిగా పోలీసులతో పాటు స్థానికులు భావిస్తున్నారు.

ఇండియా కూటమిదే విజయం

చిట్యాల, చిట్యాలరూరల్, మర్రిగూడ, దేవరకొండ, మునుగోడు, చండూరు, మే 4: వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ఇండియా కూటమి విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ఎమ్మెల్యేలు వీరేశం, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం చిట్యాలలో పార్టీ రాష్ట్ర నాయకుడు గుత్తా అమిత్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే వీరేశం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లలో బీజేపీ చేసిందేమీ లేదన్నారు. మత విద్వేషాలు రెచ్చగొట్టి మరోసారి అధికారంలోకి రావడానికి ప్రయత్నిస్తుందని విమర్శించారు. బీఆర్ఎస్ కోలుకోవడం కష్టమని, మతోన్మాద బీజేపీని ఓడించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు పార్టీలో కాంగ్రెస్‌లో చేరారు. చిట్యాల మండలం ఉరుమడ్లలో కిరణ్‌కుమార్‌రెడ్డిని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామశివారులో ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి ఓటు వేయాలని అభ్యర్థించారు.

● నాంపల్లి మండలంలో నిర్వహించిన రోడ్‌షో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి మాట్లాడారు. గత ప్రభుత్వం అధికారంలో ఉన్నా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. ఎంపీగా కిరణ్‌కుమార్‌రెడ్డి గెలిపిస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని అన్నారు. మధుయాష్కీ మాట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్ రావడం ఖాయమని అన్నారు.

● కాంగ్రెస్ పార్టీకి మాదిగల మద్దతు ఉంటుందని, పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాదిగలందరూ కాంగ్రెస్ పార్టీ వెంటే ఉంటారని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చింతబాబు మాదిగ అన్నారు. దేవరకొండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బాలునాయక్‌ను కలిసి కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటించి మాట్లాడారు. మాదిగలంతా కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు.

● వడ్డెరలను ఆదరించి కార్పొరేషన్ ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీకే తమ మద్దతు ఉంటుందని ఎంబీసీ చైర్మన్ జేరిపేట జైపాల్ తెలిపారు. మునుగోడులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వెనుకబడిన కులవృత్తుల సంరక్షణకు చర్యలు తీసుకుంటున్న కాంగ్రెస్‌కు మద్దతిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో పార్టీ గెలుపునకు బూత్ కమిటీల పాత్ర కీలకమని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి ఎక్కడ ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అందరిని కలుపుకొని పోవాలన్నారు. బీఆర్ఎస్, బీజేపీల నుంచి కాంగ్రెస్ పార్టీలోకి రావాలని చాలామంది నాయకులు కార్యకర్తలు చూస్తున్నారని, అలాంటి వారిని ఎవరూ అడ్డుకోవద్దని, పార్టీలోకి గౌరవంగా ఆహ్వానించాలని కోరారు.

● చండూరు మండలం ఉడుతలపల్లిలో నిర్వహించిన సమావేశంలో రాజగోపాల్‌రెడ్డి మాట్లాడారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు తొమ్మిది రోజులు క్షేత్ర స్థాయిలో బూత్ కమిటీ సభ్యులు, కార్యకర్తలు శ్రమించి అత్యధిక మెజారిటీ తెచ్చే విధంగా పని చేయాలని ఆయన సూచించారు.

మతతత్వ బీజేపీని ఓడించాలి : జహంగీర్

కట్టంగూరు, శాలిగౌరారం, మే 4: వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో మతతత్వ బీజేపీని ఓడించాలని సీపీఎం భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి జహంగీర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం కట్టంగూరు, శాలిగౌరారం మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. దేశంలో మతాల మధ్య చిచ్చుపెడుతున్న బీజేపీని ఓడించి నరేంద్రమోదీని గద్దె దించాలని పిలుపునిచ్చారు. బీజేపీ పదేళ్ల పాలనలో దేశంలో అనేక అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయని, దేశ ప్రధాని నరేంద్ర మోదీ దేశ సంపదను ఆదానీ, అంబానీలకు పంచి పెడుతున్నారని విమర్శించారు. మూసీ నదికి అందం కాదని మొదలు నీటిని శుద్ధీకరించాలని డిమాండ్ చేశారు. తాను గెస్తే ఢిల్లీలో గళం విప్పి మొదట మూసీ నదిని శుద్ధీకరించడంతో పాటు, అన్ని ప్రాంతాలకు సాగునీటి సౌకర్యం, ఎయిమ్స్‌ను పూర్తి స్థాయిలో నడిపించేందుకు కృషి చేస్తానన్నారు.

ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది

మాడ్గులపల్లి, మే 4: ఎస్సీ వర్గీకరణ అమలుచేసేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని టీపీసీసీ జనరల్ సెక్రటరీ కొండేటి మల్లయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారెంటీల్లో ఐదింటిని అమలుచేసిందని అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఇచ్చిన హామీలను అమలుచేయకుండా కాలయాపన చేశారని అన్నారు. అదేవిధంగా పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం పనిచేస్తుందని, ఎస్సీ, ఎస్టీ, బీసీల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు గడ్డం వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ షఫి, మాధవరెడ్డి, నర్సింహ, మోహన్, వెంకట్‌రెడ్డి, భిక్షంరెడ్డి, సత్యనారాయణ, నిరంజన్, లచ్చయ్య, శంకర్ పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరికల వెల్లువ


● పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపు

నల్లగొండ, దేవరకొండ, నార్కట్‌పల్లి, నాగార్జునసాగర్, మర్రిగూడ, గుర్రంపోడు, మే 4: నల్లగొండ జిల్లాలోని పలు మండలాకు చెందిన వివిధ పార్టీలకు చెందిన నాయకులు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గ్రామాలలోని నిరుపేదలందరికీ పథకాలు అందజేస్తూ న్యాయం చేస్తుందన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో నియోజకవర్గంలో ప్రాజెక్టులను పూర్తిచేయకపోవడంతో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన పలు సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. అనంతరం పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలుపునకు కృషి చేస్తామని అన్నారు.

● జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) వైస్‌చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో ఆయన దయాకర్‌రెడ్డికి కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అంతకు ముందు దయాకర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని కూడా కలిసి పార్టీలో చేరారు. చిట్యాల మండలం గుండ్రాంపల్లి పీఏసీఎస్ సొసైటీకి చైర్మన్‌గా ఎన్నికై డీసీసీబీ డైరెక్టర్‌గా ఆ తర్వాత వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఆయన రాష్ట్ర పీఏసీఎస్ చైర్మన్ల ఫోరం అధ్యక్షుడిగా కూడా కొనసాగుతున్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఎంతగానో నచ్చాయని అన్నారు. ప్రభుత్వ సహకారంతో బ్యాంకు అభివృద్ధికి రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తానన్నారు. డీసీసీబీ వైస్ చైర్మన్ కాంగ్రెస్ పార్టీలో చేరడం ఎంతో హర్షణీయమని డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి అన్నారు.

● దేవరకొండ పట్టణానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, కౌన్సిలర్ హనుమంతు వెంకటేష్‌గౌడ్, బీఆర్ఎస్ జడ్పీటీసీ మారేపాకల అరుణ సురేష్‌గౌడ్ వారి అనుచరులు, పలు గ్రామాల బీఆర్ఎస్ సర్పంచులతో కలిసి ఎమ్మెల్యే బాలునాయక్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే బాలునాయక్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎం.ఎ.సిరాజ్‌ఖాన్, జాల నర్సింహారెడ్డి, పున్న వెంకటేశ్వర్లు, జూలూరి ధనలక్ష్మీబాలనారాయణగౌడ్, శ్రీధర్‌రెడ్డి, వెంకటయ్యగౌడ్, రేణుకనారాయణ, విష్ణువర్ధన్‌రెడ్డి, ధన్రునాయక్ పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు ఎమ్మెల్యే వేముల వీరేశం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మాజీ ధర్మకర్త కొండేటి వేణు, పాలసంఘం చైర్మన్ రేగట్టె వెంకట్‌రెడ్డి, గౌరీదేవీ శంకర్, దొడ్డి యాదయ్య, కోక సంజీవ, శేలోజి దేవర లచ్చయ్య తదితరులు ఉన్నారు. నార్కట్‌పల్లికి చెందిన లఘు చిత్రాల దర్శకుడు దైద నాగరాజు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నాడు.


సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న డీసీసీబీ వైస్ చైర్మన్ దయాకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి

నార్కట్‌పల్లి మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో నాయకులు కన్నెబోయిన సైదులు, పర్రెపాటి లింగస్వామి, సైదులు, సురేందర్ ఉన్నారు.

● పెద్దవూర జడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. హైదరాబాద్‌లో సీఎం నివాసంలో ఆ పార్టీ రాష్ట్ర నాయకులు గుత్తా అమిత్‌రెడ్డి, గుత్తా జితేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కృష్ణారెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. ఆయన వెంట పెద్దవూర వైస్ ఎంపీపీ గోనె వివేక్‌రావు, ఆర్ఎస్ఎస్ మాజీ అధ్యక్షుడు గజ్జెల లింగారెడ్డి, సీనియర్ నాయకులు వాసుదేవుల సత్యనారాయణరెడ్డి, వల్లపురెడ్డి ఉన్నారు.

● మర్రిగూడ మండలంలోని శివన్నగూడ గ్రామానికి చెందిన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నాయకులు మునుగోడు క్యాంపు కార్యాలయంలో జడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరి కండువా కప్పుకున్నారు. బీజేపీకి చెందిన సిరిపగడ ఆనందరావు, బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ ఉపసర్పంచ్ వెంకటయ్యతో పాటు మరో 50మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు.

● నల్లగొండ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొప్పోలు గ్రామంలో జరిగిన పార్టీలో చేరికల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎంపీపీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మంచికంటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన పలువురు తాజా మాజీ సర్పంచులు, ఎంపీటీసీలతో సహా పలువురు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు కంచర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, చెనమల్ల జగదీశ్వర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ గాలి రవికుమార్, పార్టీ మండల అధ్యక్షుడు సర్వయ్యయాదవ్, జగదీశ్వర్‌రెడ్డి, యాదవరెడ్డి పాల్గొన్నారు.


చిట్యాల: ఎమ్మెల్యే వీరేశం సమక్షంలో చేరుతున్న నాయకులు


ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో చేరుతున్న నాయకులు


ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి సమక్షంలో చేరుతున్న నాయకులు

ప్రజాభిమానమే శ్రీరామరక్ష : ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ, మే 4: ప్రజాభిమానమే తనకు శ్రీరామరక్ష అని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం బీఎల్ఆర్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ కార్యకర్తలు అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం రాజీవ్‌భవన్‌లో రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రంథాలయంలో విద్యార్థులకు నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. వెంకటాద్రిపాలెంలో గూబ్లి వారి కాలనీలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో వంద మంది పేద పిల్లలకు బట్టలు పంపిణీ చేశారు. ప్రకాష్‌నగర్, రెడ్డి కాలనీల్లో బర్త్‌డే కేక్‌ను కట్ చేసి అభిమానులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ లింగ,కుల, మత, వర్గ, వర్ణ తేడాలు లేకుండా ప్రజలంతా సుఖసంతోషాలతో గడపాలన్నదే నా అభిమతం అన్నారు. ప్రజల ఆదరాభిమానాలే తనకు తన కుటుంబానికి రక్ష అని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు స్కైలాబ్‌నాయక్, డీసీసీ జనరల్ సెక్రటరీ చిలుకూరి బాలు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొదిల శ్రీనివాస్, తమ్మడబోయిన అర్జున్, కాంగ్రెస్ కిసాన్ జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, కౌన్సిలర్లు పందిరి రామకృష్ణ, దేశిడి శేఖర్‌రెడ్డి, కొమ్ము శ్రీనివాస్, ఇమ్రాన్ పాల్గొన్నారు.


కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

● వేములపల్లి మండలంలోని శెట్టిపాలెం గ్రామంలో కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో పల్లా వీరయ్య, పల్లా వెంకటయ్య, బుసిరెడ్డి వెంకట్‌రెడ్డి, లక్ష్మీనర్సు, సోమమ్మ, అశోక్ పాల్గొన్నారు.

హోం ఓటింగ్‌ను సద్వినియోగం చేసుకున్న వృద్ధులు

మునుగోడురూరల్, మర్రిగూడ, చిట్యాలరూరల్, నార్కట్‌పల్లి, కనగల్, మే 4: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా హోంఓటింగ్ విధానంలో పలువురు వృద్ధులు దివ్యాంగులు తమ ఓటు హక్కును శనివారం వినియోగించుకున్నారు. జిల్లాలోని పలు మండలాల్లో వృద్ధులు, దివ్యాంగులు, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. స్పందించిన ఎన్నికల అధికారి దరఖాస్తు చేసుకున్న వారికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవడానికి అవకాశం కల్పించారు. దీంతో శనివారం వారు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

● మునుగోడు మండలంలోని 27 మంది వృద్ధులు హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకోగా 22 మంది హోం ఓటింగ్ వినియోగించుకున్నారు. ఓటింగ్ తీరును ఆర్డీవో సుబ్రహ్మణ్యం పరిశీలించారు. ఆయన వెంట ఆర్ఐ నాగరాజు ఉన్నారు.

● మర్రిగూడ మండలంలో 51మంది వృద్ధులు, దివ్యాంగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. మండలంలో హోం ఓటింగ్ మండల ప్రొసిడింగ్ అధికారి ఉపేందర్ సమక్షంలో 20మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వారి వెంట వీఆక్వో బషీర్, లక్ష్మమ్మ, పోలీస్ సిబ్బంది పలువురు ఉన్నారు.

● చిట్యాల మండలంలో అధికారులు రెండు టీములుగా ఏర్పడి మండలంలోని పలు గ్రామాల్లో హోం ఓటింగ్‌ను నిర్వహించారు. మండలంలో 57మంది దరఖాస్తు చేసుకోగా మండలంలోని గ్రామాల్లో నలుగురు స్థానికంగా లేక ఓటు వేయకపోగా 51మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.


కనగల్‌లో ఓటువేస్తున్న వృద్ధురాలు

● నార్కట్‌పల్లి మండలంలో 41 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 43 మంది హోం ఓటర్లను అధికారులు గుర్తించారు. వీరితో ఓటేయించడానికి రెండు బృందాలు రాగా రెండు రోజుల్లో మొత్తం 41మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా ఒకరు అందుబాటులో లేకపోగా మరొకరు చనిపోయినట్లు అధికారులు తెలిపారు.

● కనగల్ మండలంలోని పలు గ్రామాల్లో మొత్తం 15 మంది ఇంటివద్దనే ఎన్నికల అధికారుల సమక్షంలో ఓటేశారు. ఆదివారం కనగల్, పర్వతగిరి, బొమ్మపల్లి, అమ్మగూడెం, ఎంగొరారం, లచ్చుగూడెం గ్రామాల్లో హోం ఓటింగ్‌ను నిర్వహించనున్నట్లు పీవో శంకర్ తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్ఐ యాదగిరి, బీఎల్వో అరుణ తదితరులు పాల్గొన్నారు.

జేపీ నడ్డా బహిరంగ సభను విజయవంతం చేయాలి

నల్లగొండ, మే 4: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఈ నెల 6వ తేదీన నల్లగొండకు రానున్నట్లు ఆ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి తెలిపారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని మేకల అభినవ్ స్టేడియంలో జరిగే బహిరంగ సభలో నడ్డా పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సభకు పార్లమెంట్ పరిధిలోని నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. తాను ప్రచారం చేస్తున్న క్రమంలో ప్రజలందరూ బీజేపీనే కోరుకుంటున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్‌లో వారసత్వ రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. తాను గెలిచిన వెనువెంటనే మేనిఫెస్టోను భగవద్గీతగా భావించి యువతకు ఉపాధి అవకాశం కల్పించడంతో పాటు, వ్యవసాయన్ని అభివృద్ధి చేస్తానన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు నూకల నర్సింహారెడ్డి, బండారు ప్రసాద్, పిల్లి రామరాజుయాదవ్, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, భూపాల్‌రెడ్డి, లింగస్వామి, రాఖీ, మహేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శానంపూడి సైదిరెడ్డి

రైతులకు రూ. 517 కోట్ల చెల్లింపులు

● అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్

నల్లగొండరూరల్, మే 4: యాసంగి ధాన్యం కొనుగోళ్లలో భాగంగా ధాన్యం అమ్మిన రైతులకు రూ.517 కోట్లు చెల్లించి వారి ఖాతాల్లో జమ చేసినట్లు రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో యాసంగి కొనుగోళ్లకు గాను 370 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ద్వారా రూ.631 కోట్ల విలువ చేసే, 2,86,565 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని, 45,598 మంది రైతుల నుంచి కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. ఇప్పటి వరకు ధాన్యం అమ్మిన 36,928 మంది రైతులకు, రూ.517 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. మిగిలిన రూ. 117 కోట్లు త్వరలోనే చెల్లించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పోస్టల్ ఓటు రాకుంటే ఎన్నికల విధులకు గైర్హాజర్

మిర్యాలగూడ, మే 4: పోస్టల్ ఓటు రాకుంటే ఎన్నికల విధులకు గైర్హాజరై ఓటు వేస్తామని ఉపాధ్యాయులు మలిగిరెడ్డి సైదిరెడ్డి, గార్లపాటి ఉమాకర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం పోస్టల్ ఓటు రాని వారితో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ కేఎస్ఎం కళాశాలలో మొదటి ట్రైనింగ్ జరుగుతు న్న సమయంలోనే పోస్టల్ ఓటు కోసం ఫారం 12ను అందజేశామని తెలిపారు. శనివారం ఓటు హక్కు వినియోగించుకునేందుకు కేఎస్ఎం కళాశాలకు వెళ్లగా తమ ఓటు లేదని చెప్పారని అన్నారు. ఈ విషయమై ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లగా పరిశీలిస్తామని చెప్పారు. పోస్టల్ ఓటు వేసే అవకాశం 8వ తేదీ వరకే ఉన్నందున ఓటు వేసే అవకాశం కల్పించాలన్నారు. లేనిచో పోలింగ్ విధులకు గైర్హాజరై ఓటు వేయటానికి ప్రాధాన్యమిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణుధర్, ఇందిరాకోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంకటేష్‌ను సన్మానించిన నాయకులు


యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్‌ను సన్మానిస్తున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్, మే 4: యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన మిట్టపల్లి వెంకటే ష్‌ను బీసీసెల్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బీసీ సెల్ నాయకుడు ప్రవీణ్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి పాటు పడుతూ నే సామాజిక సేవా కార్యక్రమాలతో వెంకటేష్ అందరి మన్ననలు పొందుతున్నారని కొనియాడారు. భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు ప్రదీప్, అజయ్, నవీన్, లవకుమార్, వరుణ్, రంజిత్ పాల్గొన్నారు.

ఇండియా కూటమి జనరల్‌బాడీ సమావేశం రేపు

దేవరకొండ, మే 4: సీపీఐ బలపర్చిన నల్లగొండ పార్లమెంట్ ఇండియా కూటమి కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి విజయాన్నికాంక్షిస్తూ ఈ నెల 6వ తేదీన దేవరకొండ శివసాయి గార్డెన్‌లో ఇండియా కూటమి జనరల్‌బాడీ సమావేశం నిర్వహించనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం చెప్పాలని కోరారు. ఇండియా కూటమి సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు మైనుద్దీన్, సీపీఐ పట్టణ కార్యదర్శి వెంకట్రాములు, నాయకులు బుచ్చయ్య, నగేష్, ఆంజనేయులు, కందుకూరి శ్రీను, జ్యోతిబసు, లింగంపల్లి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

సంక్షిప్త సమాచారం...

శాలిగౌరారం: బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్ గెలిపించాలని కోరుతూ పలువురు నాయకులు ప్రచారం నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. చిత్తలూరులో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి ఓటు వేయాలని అభ్యర్థించారు.

శాలిగౌరారం: మండలంలోని వల్లాల బీఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడిగా గుండ్లపల్లి రవీందర్, ఎన్‌జీ కొత్తపల్లి గ్రామ బీఆర్ఎస్ పార్టీ నూతన గ్రామశాఖ అధ్యక్షుడిగా నూనెముంతల అంజనేయులును నియమించినట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకన్నగౌడ్ తెలిపారు.

నార్కట్‌పల్లి: మండలంలోని నెమ్మానిలో వేసవి ఖోఖో శిబిరాన్ని ప్రారంభించారు. వేసవి క్రీడా శిబిరం నిర్వహణకు అయ్యే ఖర్చును చెర్వుగట్టుకు చెందిన మాజీ ధర్మకర్త రేగట్టె నర్సిరెడ్డి ఖోఖో కోచ్ ఉయ్యాల శ్రవణ్‌కుమార్‌కు అందజేశారు. వేసవిలో నిర్వహిస్తున్న ఈ క్రీడా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నర్సిరెడ్డి విద్యార్థులకు సూచించారు.

నార్కట్‌పల్లి, కట్టంగూరు, మిర్యాలగూడటౌన్: పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి లోక్‌స భ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ గెలుపు ఖాయమని దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు గోలి ప్రభాకర్, అసెంబ్లీ కోకన్వీనర్ మాదూరి ప్రభాకర్‌రావు అన్నారు.

● కట్టంగూరు మండలంలోని అయిటిపాముల, గార్లబాయిగూడెం, రసూల్‌గూడెం గ్రా మాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

● పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి సైదిరెడ్డిని గెలిపించాలని బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు నేరెళ్ల అజయ్ కోరారు. పట్టణంలోని సీతారాంపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో అధికారం చేపట్టబోయేది బీజేపీనే అన్నారు.

దామరచర్ల, కట్టంగూరు, మిర్యాలగూడ: సీపీఎం బలపరిచిన కాంగ్రెస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని సీపీఎం మండల కార్యదర్శి మాలోతు వినోద్ నాయక్ అన్నారు. ఇండియా కూటమిలో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని రాహుల్‌గాంధీ కంటే ఎక్కువ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు.

● రఘువీర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సలీం కోరారు. మిర్యాలగూడలో పట్టణంలోని అశోక్‌నగర్ తదితర కాలనీల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీల సమస్యల పరిష్కారంతో పాటు పార్లమెంట్ నియోజకవర్గం మరింత అభివృద్ధి జరగాలంటే రఘువీర్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

● కట్టంగూరు మండలంలో కాంగ్రెస్ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థిగా చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

మాడ్గులపల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నిమ్మన నవీన్‌రెడ్డి కోరారు. మండలంలోని సీత్యాతండా, తోపుచర్ల గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి కొద్ది కాలంలోనే ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చిందన్నారు.

చిట్యాల: చిట్యాల మునిసిపాలిటీలోని బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రధాని నరేంద్రమోదీకి మరోసారి అండగా నిలవాలని కోరారు. భువనగిరి ఎంపీగా నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు పల్లె వెంకన్నగౌడ్, గంజి గోవర్ధన్, మల్లేష్‌యాదవ్, యాదయ్యగౌడ్ పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్: బీజేపీ నియోజకవర్గ కన్వీనర్‌గా సజ్జల నాగిరెడ్డిని నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి నియోజకవర్గం నుంచి అత్యధిక మెజార్టీ తెచ్చేందుకు తమ వంతు కృషి చేస్తానన్నారు. అదేవిధంగా స్థానిక సంస్థల ఎన్నికల నాటికి పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలతో కలిసి పనిచేస్తానన్నారు. తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర జిల్లా స్థాయి నాయకులుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కనగల్: కనగల్ ఆర్టీసీ బస్టాండ్‌లో న్యూకంబాల ఫౌండేషన్ అధ్యక్షురాలు కంబాల శివలీల, సమాచార హక్కు సంరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బండమీది అంజయ్య ఆధ్వర్యంలో ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఎండలు అధికంగా ఉన్న నేపథ్యంలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ పంపిణీ చేసినట్లు తెలిపారు.

దేవరకొండ: నల్లగొండ కాంగ్రెస్ పార్లమెంట్ ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ కోఆర్డినేటర్‌గా దేవరకొండ మాజీ జడ్పీటీసీ గుంజ రేణుక నారాయణను నియమిస్తూ టీపీసీసీ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా గుంజ రేణుకనారాయణ మాట్లాడుతూ నల్లగొండ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి గెలుపుకోసం అందరి సహకారంతో కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

పెద్దఅడిశర్లపల్లి: టీఎస్ ఏమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా పీఏపల్లి మండల కేంద్రానికి చెందిన మద్దిమడుగు సాయిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దేవరకొండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన టీఎస్ ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. సాయికి టీఎస్ ఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ చింత బాబుమాదిగ, నియోజకవర్గ ఇన్‌చార్జి కంబాలపల్లి వెంకటయ్య నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాయి మాట్లాడుతూ తమ ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

చిట్యాలరూరల్: చిన్నవయస్సు నుంచే చేతిరాతను అలవాటు చేసుకుంటే అక్షరాలు అందమైన ముత్యాల్లా ఉంటాయని చేతిరాత నిపుణుడు గూడూరు మహేందర్‌రెడ్డి అన్నారు. గుండ్రాంపల్లిలో విద్యార్థులకు నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణ శిబిరంలో ఆయన విద్యార్థులకు లూసిడా చేతిరాతలో (ఆంగ్లం) శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కార్యక్రమంలో గ్రంథపాలకుడు గోపగోని శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.